ప్రజాశక్తి

మంగళవారం 18 జూన్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రుషికొండ చుట్టూ సర్వత్రా చర్చ



రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనం

నాడూ, నేడూ వివాదాలకు నిలయంగా భవంతులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జగన్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం జరిగిన రుషికొండ భవనాలపై తాజాగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి నేతలు ఈ 'కొండ'పై అనుమానాలు, పలు ప్రశ్నలు కురిపిస్తుండడంతో మళ్లీ వార్తల్లోకి రుషికొండ చేరింది. ఈ చర్చ రాష్ట్రానికే పరిమితం కాలేదు. దేశం, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇదొక చర్చనీయాంశంగా మారిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. గతంలో దీని నిర్మాణం అంతా రహస్యంగా సాగడంతో చర్చకు ఆస్కారమిచ్చింది. ఇంతటి విలాసవంతమైన భవనాలను ఎలా వినియోగించాలి ? అసలేం చేయాలి ? అన్నదానిపై తాజాగా చర్చ నడుస్తోంది. పచ్చని కొండపై పర్యావరణ విధ్వంసం జరిగిందని, ఈ భవనాలను ఏం చేయాలన్నది ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారిందని ఆదివారం మిగతా 2లో..



విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని ఓ మసీదు వద్ద నమాజ్ చేస్తున్న ముస్లిములు

భక్తి శ్రద్ధలతో బక్రీద్

వార్త 5లో..



హోం మంత్రి అనితకు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

ప్రజాశక్తి - సింహాచలం, గోపాలపట్నం విలేకరులు

సింహాచలం దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పంచ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సింహాద్రి అప్పన్నను సోమవారం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రుషికొండ చుట్టూ సర్వత్రా చర్చ

మీడియాతో మాజీ మంత్రి, టిడిపి ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపిన విషయం తెలిసిందే. కూటమి అధినేతల పర్యటనల తర్వాతే దీనిపై నిర్ణయం అని ఆయన చెప్పుకొచ్చారు.

వివాదం అవుతున్న కొండ

ఎవరి అనుమతితో రూ.500 కోట్ల ఖర్చు అంటూ టిడిపి తన అధికారిక ఎక్స్ ఖాతాలో సోమవారం పోస్టును షేర్ చేసింది. 'జగన్ పేలస్‌ను కట్టించాడు. లోతైన దర్యాప్తు జరగాలి' అంటూ టిడిపి పేర్కొనడం తెలిసిందే. అత్యంత హంగులతో విలాసవంతంగా 91 ఎకరాల రుషికొండపై 9.8 ఎకరాల్లో 7 బ్లాక్‌లను గత ప్రభుత్వం సుమారుగా రూ.500 కోట్లు వెచ్చించి నిర్మించింది. కొండ దిగువ నుంచి పైకి వెళ్లేటప్పుడు ఈ ఏడు సూపర్ స్ట్రక్చర్స్ వరుసగా వంకరగా కొండ చుట్టూ ఆహ్లాదపరుస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీని నిర్మాణం సందర్భంలో జగన్ సర్కారు 20 అడుగుల ఎత్తులో ప్రహరీ నిర్మించి ఎవ్వరినీ అటు వెళ్లనియ్యకుండా రహస్యం పాటించినందున అందరి దృష్టీ అప్పుడు, ఇప్పుడూ దీనిపై పడుతోంది.

7 సూపర్ స్ట్రక్చర్స్ ఏమిటి ?

విజయనగర్ బ్లాక్, కళింగ, చోళ, పల్లవ, గజపతి, వేంగి, తూర్పు కనుమలు (గంగా) అనే పేర్లతో రుషికొండపై బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. ఈ మొత్తం భవంతుల సముదాయాన్ని ఎపిటిడిసి చేపట్టింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కట్టడాలుగా ఈ భవంతులను పలువురు అభివర్ణిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి సెమినార్లు, అంతర్జాతీయ వేదికలకు సైతం ఉపయోగించుకునేలా నిర్మాణం చేపట్టారు. జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల విధానంలో విశాఖే పరిపాలనా రాజధాని అని ప్రకటన చేశాక ఈ భవనాలను త్వరితగతిన నిర్మించిన సంగతి తెలిసిందే. దీన్ని కూటమి పార్టీలు జగన్ పేలస్ అంటూ పేర్కొంటున్నాయి. ఏదిఏమైనా భవనాల నిర్మాణాలు జరిగిపోయాయి కాబట్టి మంచికి ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు.

దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

ఆమె దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదర స్వాగతం పలికారు. అనిత ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేసి, స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు, అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వదించారు. ఇఒ ఆమెకు శాలువతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. దర్శనం అనంతరం అనిత స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రిగా స్వామివారిని దర్శనానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఆలయ పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు ఎంతో అదృష్టవంతులని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో దాడులు జరిగితే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని తెలిపారు. దీంతో భయం లేకుండా విచ్చలవిడిగా మహిళలపై దాడులు జరిగాయని అన్నారు. పోలీసులు ఇప్పటికైనా ప్రజల కోసం పనిచేయాలని అన్నారు. గతంలో జరిగిన ప్రతి సంఘటనపై చర్యలు తీసుకుంటామని, మహిళలకు అన్యాయం జరగకుండా అండగా ఉంటామని అన్నారు. ఆమె వెంట కుటుంబ సభ్యులతో పాటు స్థానిక టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.

విశాఖ పోర్టుకు రెండు అంతర్జాతీయ ర్యాంకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్టు తాజాగా రెండు అంతర్జాతీయ ర్యాంకులు సాధించింది. ప్రపంచ బ్యాంకు నిర్వహించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో 20వ స్థానంలోనూ, కంటైనర్ టెర్మినల్ పనితీరు సూచికలో 19వ స్థానంలో నిలిచి తన ప్రతిష్టను మరోమారు చాటిచెప్పింది. ఈ విజయం విశాఖపట్నం పోర్టు పనితీరును, ప్రపంచ వాణిజ్యంలో పోర్టు ప్రాముఖ్యతను తెలుపుతోందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ సోమవారం తెలిపారు. కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో తనకున్న విశేష అవకాశాలను అందిపుచ్చుకుని 2022లో ఉన్న 122వ స్థానం నుంచి ఏకంగా 102 స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి విశాఖ పోర్టు చేరుకుంది. 'పెరిగిన ర్యాంకింగ్ స్థానికంగానూ, అంతర్జాతీయంగానూ వాణిజ్య వృద్ధిలోనూ, వ్యాపార అవకాశాలను కల్పించడంలోనూ దోహదపడుతుంది. పోర్టులో పెరిగిన పని సామర్థ్యం కారణంగా సరుకు రవాణాలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేయడమే కాకుండా వ్యాపార అవకాశాలను పెంపొందించి దేశ వాణిజ్యాభివృద్ధిలో తనదైన ముద్రను వేయనుంది' అని వేణుగోపాల్ వెల్లడించారు. ఈ ఘనతను సాధించడం పట్ల పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు స్పందిస్తూ పోర్టు సాధించిన ఘనత పట్ల గర్వంగా ఉందని తెలిపారు. సిబ్బంది అంకితభావం, కష్టించేతత్వం వల్లనే ఇవి సాధ్యమయ్యాయన్నారు. ప్రపంచ పటంలో విశాఖ పోర్టును ఉన్నతంగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు 10 లక్షల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని విధించుకున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు సెమ్స్, ఐఎంయు ద్వారా పోర్టు ఉద్యోగులకు, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. పర్యావరణం, ఆరోగ్యం, సురక్ష విభాగంలో మంచి పనితీరు కనబరిచినందుకుగానూ 2022-23 ఏడాదికి గ్రీన్ టెక్ ఫౌండేషన్ విన్నర్ అవార్డు కోసం రికమెండ్ చేసినట్లు తెలిపారు.

కోండ్రు మురళికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ జిల్లా కలెక్టరేట్ : ఉత్తరాంధ్రకు చెందిన దళిత ఎమ్మెల్యే కోండ్రు మురళికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని విద్యార్థి, నిరుద్యోగ యువజన జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సిర్ల శ్యాంసుందరరావు డిమాండ్ చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆటో యూనియన్ నేత కర్రి అప్పలరాజు మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎం సభ్యులు, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి అప్పలరాజు (54) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. జగదాంబ ఏరియా 31వ వార్డు కృష్ణా గార్డెన్‌లో ఆయన నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమారుడు లెనిన్, కుమార్తె సాహితి ఉన్నారు. 25 ఏళ్లుగా పార్టీ సభ్యునిగా సిపిఎం అభివృద్ధికి కృషి చేశారు. డివైఎఫ్ఐలో పనిచేస్తూ యువకులను పార్టీలోకి తీసుకొచ్చారు. నగర వ్యాప్తంగా ఆటో యూనియన్‌ను విస్తరించడానికి కృషి చేశారు. భార్య వరుణ మహిళా సంఘంలో పనిచేశారు. తమ్ముడు గణేష్ ప్రస్తుతం డివైఎఫ్ఐ విశాఖ జిల్లా ఉపాధ్యక్షునిగా, సిపిఎం జగదాంబ జోన్ కమిటీ సభ్యునిగా ఉన్నారు. అప్పలరాజు మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.



అప్పలరాజు (ఫైల్‌ఫొటో)

కుమార్, జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, వై.రాజు, కె.చంద్ర శేఖర్ తదితరులు సంతాపం తెలియజేశారు.

మంగళవారం ఉదయం 11 గంటలకు టూటౌన్ పోలీసు స్టేషన్ దగ్గరలో ఉన్న కృష్ణా గార్డెన్ నుంచి అప్పలరాజు అంతిమయాత్ర ప్రారంభమవుతుందని సిపిఎం నాయకులు తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌లో మునిగిన బోటు

బాధితులకు వంశీ, వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదవశాత్తూ 11 నెంబర్ జెట్టీలో ఎంఎం 295 నెంబరుగల కంచెరుకు చెందిన ఫిషింగ్ బోటు సోమవారం మునిగిపోయింది. ఆ సమయంలో బోటులో ఎవరూ లేరు. ఈ సంఘటనతో దాని యజమానులకు భారీగా నష్టం జరిగింది. విషయం తెలిసిన వెంటనే ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బోటు మునిగిపోయిన సంగతిని మత్స్యశాఖ జెడికి, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. బోటు యజమానులను ఆదుకొని, నష్ట పరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా ఫిషింగ్ బోటు మునిగిపోయిన సంగతి తెలియడంతో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును ఫిషింగ్ బోటు యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఆయన తన వంతు సహాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గణేష్ కుమార్ మాట్లాడుతూ బోటు మునిగిపోయిన సంగతిని ప్రభుత్వం, అధికారుల



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దృష్టికి తీసుకువెళ్లి బోటుకు నష్టపరిహారం అందేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం సీనియర్ నాయకులు పిసి.అప్పారావు, మైలపల్లి మసేన్, గనగళ్ల రామరాజు, కొండబాబు, అన్నెం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యజమానులను పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఫిషింగ్ హార్బర్‌లో నీట మునిగిన బోటు తాలూకా యజమానులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం సాయంత్రం పరామర్శించి, రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మత్స్యశాఖ జెడి, కలెక్టర్‌లతో మాట్లాడి బాధితులకు వెంటనే తక్షణ సహాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార పెద్దలు శివ, వసంత లక్ష్మి, రవి, చిన్న, తాతాజీ, బాలాజీ పాల్గొన్నారు.



విమానాశ్రయంలో మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెంనాయుడు

ప్రముఖుల రాకతో విమానాశ్రయం కిటకిట

ప్రజాశక్తి - విశాఖపట్నం : రాజకీయ ప్రముఖుల రాకతో విశాఖ విమానాశ్రయం సోమవారం కిటకిట లాడింది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుల రాకతో వారికి ఘన స్వాగతం పలికేందుకు టిడిపి కార్యకర్తలు, వారి అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలిరావడంతో రద్దీ నెలకొంది. కొద్దిసేపు విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అనితకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను విశాఖకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు పుక్కళ్ల శంకర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నప్పుడు మహిళల రక్షణ కోసం పోరాటం చేసిన అనిత హోం శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం శుభపరిణామమని అన్నారు. అనంతరం శంకర్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

అనితను ప్రభుత్వ అతిథి గృహంలో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి కుంచె, జిల్లా ప్రెసిడెంట్ యజ్జల విజయ కుమార్, రెసిడెన్షియల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ నిర్మల మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సందీప్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, డిఇఇ ఇరిగేషన్ ముక్కల రాజేంద్ర, యమ్మల రాజు, పాలిటెక్నిక్ కాలేజ్ లెక్చరర్ రమణ, తహసీల్దార్ అంబేద్కర్, రమణమూర్తి, బాత రాజేష్, తలే రమణ, వై.పోలీస్, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతుబజారు పూర్తయ్యేదెన్నడో..?

- రెండేళ్లుగా నిలిచిన చివరి దశ నిర్మాణ పనులు
- వినియోగంలోకి తేవాలంటూ ప్రజల ఎదురుచూపులు
- అధికారులు, నేతల నిర్లక్ష్యంపై జనం అసహనం



రెండేళ్లుగా నిర్మాణం చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిన రైతుబజారు

ప్రజాశక్తి - ఆరిలోవ : రైతుబజారు కోసం ఆరిలోవ ప్రాంత ప్రజల ఎదురుచూపులు తప్పడం లేదు. పదోవార్డు తోటగరువులో రైతుబజారు ఏర్పాటుకు నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించగా, ఆఖరిదశలో నిర్మాణం నిలిచిపోవడంతో ప్రారంభం కాని పరిస్థితి. రెండేళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేయడంతో భవనాల మధ్య పిచ్చిమొక్కలు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది.

ఏళ్లతరబడి ఆరిలోవ ప్రాంత ప్రజల రైతుబజార్ కలలను సాకారం చేయడానికి రెండేళ క్రితం రూ.80లక్షల నిధులు మంజూరు చేయడం, 10వ వార్డు పరిధి తోటగరువు, ఎర్నిమాంబ ఆలయానికి ఎదురుగా గల ప్రభుత్వ స్థలంలో రెండేళ్ళ క్రితం అత్యాధునిక హంగులతో రైతుబజార్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. విమ్స్ వెనుక భాగంలో రైతుబజార్ కోసం సుమారు అర ఎకరా స్థలం కేటాయించారు. దీనిలో 48 షాపులు, ఒక కార్యాలయం, ఒక స్టోర్ గది, ఒక టాయిలెట్ బ్లాక్, ఆర్ఓ ప్లాంట్‌తో కూడిన రైతుబజార్ నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి, చకాచకా సాగడంతో రైతుబజారు అందుబాటులోకి వస్తుందని ఎంతో ఆశించారు.అయితే 70 నుంచి 80 శాతం వరకు పనులు పూర్తయిన తర్వాత ఏడాదికి పైగానిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో చివరి దశకు చేరిన తర్వాత రైతుబజారు పనులు నిలిచిపోవడం, తర్వాత పట్టించుకునే దిక్కు లేకపోవడంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు. . మిగిలిన పనులు ఎప్పటికి పూర్తవుతాయో, రైతుబజారు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అయితే ఏడాదికి పైగా రైతు బజారు నిర్మాణ పనులు నిలిచిపోవడం, అటుగా వెళ్లేవారెవరూ కానరాకపోవడంతో దుకాణసముదాయాల మధ్య, పరిసరాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, రైతుబజారు కళాహీనంగా తయారయ్యింది. సుమారు లక్షకు పైగా పేదలు, మధ్యతరగతి జనాభా ఉన్న ఆరిలోవ ప్రాంతంలో రైతుబజార్ అందుబాటులోకి వస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు ఆఖరిదశలో ఉన్నప్పుడు ఇలా వదిలేయడంపై ప్రజలు పెదవివిరుస్తున్నారు.

బయటమార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్న నేపథ్యంలో, రైతుబజారులో అందుబాటు ధరలో, తాజా కూరగాయలు దొరకుతాయన్న ఆశలు నెరవేరడం లేదని వాపోతున్నారు. దీంతో కూరగాయలు అవసరమైన వారు ఎంవిపి కాలనీ, సీతమ్మధార, ఇతర ప్రాంతాల రైతుబజార్‌లకు వెళ్లాల్సి వస్తోందని, పోనీ అక్కడకు వెళదామన్నా, నేరుగా బస్సులు, ఇతర రవాణా సౌకర్యాలు లేకపోవడంతో రెండు మూడు ఆటోలను మారి వెళ్లడంతో ఛార్జీల భారం తడిసి మోపెడు అవుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధికారులు స్పందించి, ఆరిలోవలో రైతుబజార్ నిర్మాణాన్ని పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

హోంమంత్రికి తెలుగు శక్తి అధ్యక్షుడు రామ్ వినతి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: వైసిపి పాలనలో బాధ్యతలను మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. సోమవారం సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా వైసిపి నాయకులకు కొంతమంది పోలీసు అధికారులు తొత్తులుగా వ్యవరించారన్నారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాటం చేసిన తనపై అప్పట్లో మంత్రిగా ఉన్న గుడివాడ అమర్ అనుచరులు ఫోన్ చేసి దుర్భాషలాడి, చంపుతామని బెదిరించారన్నారు. మరోవైపు తాను ఇంట్లో లేని సమయంలో పోలీసులు వచ్చి తన తండ్రిని బెదిరించడంతో ఆసుపత్రి పాలయ్యారన్నారు. తన కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు.

ఇలా వరుసగా జరిగిన ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని, చివరకు అప్పటి హోంమంత్రి సుచరితకు ఫిర్యాదు చేస్తే, నిందితులపై అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ లిఖితపూర్వకంగా విశాఖ పోలీస్ కమిషనర్‌కు ఆదేశించినా, పోలీసుల నుంచి కనీస స్పందన కరువైందని వాపోయారు. అనేకసార్లు సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. వైసిపి హయాంలో అధికారులు ముఖ్యంగా పోలీసులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై తక్షణమే దర్యాప్తు చేయించి దోషులపైనా, బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని హోంమంత్రిని కోరారు. హోంమంత్రిని కలిసిన వారిలో 14వ వార్డు టిడిపి అధ్యక్షుడు పివి.వసంతరావు, పి.జగదీష్ బాబు, బొడ్డేపూడి దొరబాబు ఉన్నారు.

125 మందికి ఉచిత వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అవినాష్

ప్రజాశక్తి- గాజువాక : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెదగంట్యాడ శ్రీ సాయిరాం క్లినిక్‌లో రైజ్ హాస్పిటల్ సౌజన్యంతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 125 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైజ్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో మురికివాడల్లో నివసిస్తున్న పేదలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో, ప్రతినెలా ఏదో ఒకరోజున తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించి, రోగులకు వైద్యసేవలు అందిస్తున్నామని, భవిష్యత్‌లో కొనసాగిస్తామన్నారు.

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు విజృంభించి, జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలంతా తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నళిని, డాక్టర్ మీనాక్షి, గ్రామీణ వైద్యులు అను, నాయక్, గంగాభాయ్, కౌసల్య భవాని, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతో విశాఖ ఉక్కు పరిరక్షణ

1222వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం: ఐక్యంగా పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కాకుండా పరిరక్షించుకుందామనిపోరాట కమిటీ నాయకులు, క్యూఎటిడి విభాగానికి చెందిన శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరం సోమవారం 1222 రోజులకు చేరుకుంది. సోమవారం దీక్షల్లో క్యూఎటిడి, ఇన్స్ట్రుమెంటేషన్, ఆర్అండ్‌డి, ఇటిఎల్, డిఎన్‌డబ్ల్యు విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత లాభాల్లో ఉన్న విశాఖఉక్కును నష్టాలలోకి నెట్టిందని, అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు.నాడు కేంద్రం కేవలం రూ. 5వేల కోట్ల పెట్టుబడి పెడితే, నేడు ఐదు లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ, మూడున్నర లక్షల కోట్ల ఆస్తులు కూడగట్టుకుని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.65 వేల కోట్లను పన్నుల రూపేణా చెల్లించిన ఏకైక భారత ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు మాత్రమేనన్నారు.

అలాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రయివేటుకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనంపై త్వరలో ప్రకటన చేయాలని కోరారు. వర్కింగ్ క్యాపిటల్; ముడిసరుకును అందజేసి, పూర్తిస్థాయి ఉత్పత్తికి వీలుగా కావలసిన ఆర్థిక వనరులను స్టీల్‌ప్లాంట్‌కు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ముఖ్యమైన హామీల్లో ఐదింటిని నెరవేరుస్తూ సంతకాలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ నూకరాజు ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూకరాజు మాట్లాడుతూ, మెగా డిఎస్‌సి, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, సామాజిక పింఛన్లు సాయం పెంపు, అన్నాక్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై సంతకాలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. టిడిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్, గాడు సన్యాసి నాయుడు, కె నాగరాజు, ఎం సంజీవ్‌కుమార్, బిజెపి నియోజకవర్గ ఇంఛార్జి కె రామానాయుడు పాల్గొన్నారు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి

భీమిలి ప్రజల రుణం తీర్చుకుంటా

విజయోత్సవ సభలో ఎమ్మెల్యే గంటా



గజమాలతో ఎమ్మెల్యే గంటాను స్వాగతిస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి- ఆనందపురం 17: మండలంలోని పెద్దపాలెం, శొంఠ్యాం గ్రామాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజయోత్సవ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, నియోజవర్గ ప్రజలు తనపట్ల చూపిన ఆదరభిమానాలకు మరువలేనివన్నారు. తాను పోటీ చేసిన నియోజకవర్గంలో మళ్లీ ఎప్పుడూ పోటీ చేయరన్న అపవాదును శాశ్వతంగా చెరిపేయాలనే బలమైన సంకల్పంతో భీమిలి నుంచే మళ్లీ ఎన్నికల్లో పోటీకి దిగి, అందరి ఆశీస్సులతో ఘన విజయం సాధించానన్నారు. రాష్ట్రంలోనే రెండో అత్యధిక మెజారిటీ 92,401 ఓట్ల తేడాతో గెలిపించిన భీమిలి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఐదేళ్లుగా పార్టీకష్టకాలంలో ఎన్నో ఒత్తిళ్ల మధ్య పనిచేసిన టిడిపి నేతలు, కార్యకర్తలు తలెత్తుకుని తిరిగేలా అండగా ఉండి, అవసరమైన సాయం, సౌకర్యాలను కల్పిస్తానని గంటా భరోసానిచ్చారు. కార్యక్రమంలో నియోజవర్గ నాయకులు కోరాడ రాజబాబు, కంటిపోతు రామానాయుడు, స్థానిక నాయకులు బలిరెడ్డి మల్లికార్జునరావు, గన్ రెడ్డి రమేషబాబు, పాండురంగ అప్పలరాజు యర్ర పైడిరాజు, మరిపిల్ల శ్రీనివాసరావు, కోరాడ తమ్మి నాయుడు, శిర్ల అప్పలనాయుడు, కంచరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పాత పెందుర్తి హాస్పిటల్ దగ్గర ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామికి తమలపాకు, సింధూర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఇతర ప్రముఖులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ పండగ

ప్రజాశక్తి-పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో దుర్గాలమ్మ పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవకమిటీ అధ్వర్యంలో ఈనెల 16న ఆదివారం దుర్గాలమ్మ దేవర మహోత్సవాన్ని నిర్వహించారు. 17న సోమవారం అమ్మవారి తోలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. 18న మంగళవారం బంగారమ్మకు పసుపుకుంకుమ పూజలు సమర్పణ చేసి పూజలు చేశారు. దుర్గాలమ్మ అనుపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. సోమవారం తోలేళ్ల పండుగ సందర్భంగా రాత్రి బుర్రకథ సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం అనుపోత్సవం సందర్భంగా కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో దుర్గాలమ్మ రథం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

ఉక్కు అధికారుల సేవలు భేష్

స్టీల్‌ప్లాంట్ జిఎం(ఎంఎస్) మధుసూదనరావు



రిటైర్డు అధికారులను సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ జిఎం

ప్రజాశక్తి- ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జిఎం బిటి.నాయక్, డిజిఎం (హెచ్‌ఆర్, లైజన్ ఆఫీసర్) వితిరుపతి రావు సేవలు ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (ఎంఎస్) ఎం.మధుసూధనరావు ప్రశంసించారు. సోమవారం స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీ భవన్‌లో ఉక్కు అధికారులు ఉద్యోగ విరమణ చేసిన బిటి.నాయక్, వి. తిరుపతిరావులకు ఆత్మీయ సత్కారం జరిగింది.

ఈ సందర్భంగా జిఎం మధుసూధనరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌పాంట్‌లో వివిధ హోదాల్లో అధికారులుగా విధులు నిర్వహించిన బిటి.నాయక్, తిరుపతి రావులు పలువురి మన్ననలు పొందారని కొనియాడారు. ఉక్కు అధికారులు, ఉద్యోగుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు తమ వంతు సేవలను అందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన అధికారులను పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.

కెజిహెచ్ ప్రతిష్టను మరింత పెంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల పేదల ఆరోగ్య ప్రదాయినిగా శతాబ్ధ కాలానికి పైగా విశిష్టసేవలు అందిస్తున్న కెజిహెచ్‌కు ప్రతిష్టను కొనసాగిస్తూనే, మరింత మంచి పేరు వచ్చేలా ఇక్కడి వైద్యులు సేవలు అందించి సహకరించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. సోమవారం కెజిహెచ్‌లోని వైద్యాధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి, వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు పాల్గొన్నారు

పల్లాను స్వాగతించేందుకు తరలిన నేతలు



బైక్‌ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నగరానికి వస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశాఖ విమానాశ్రయంలో కూటమి శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. పల్లా శ్రీనివాసరావుకు స్వాతం పలికేందుకు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో 9, 10, 11, 12, 13 వార్డుల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సోమవారం సాయంత్రం 12వ వార్డు తోటగరువు, టిడిపి కార్యాలయం నుంచి భారీ బైక్‌ర్యాలీతో తరలి వెళ్ళారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బుడుమూరు గోవిందు, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం పాల్గొన్నారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలు..



- రాత్రి వేళ కరెంట్ నిలుపుదలతో జనం కష్టాలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న వృద్ధులు, చిన్నారులు
- ఏవేవో కారణాలను చెబుతున్న అధికారులు

ప్రజాశక్తి -తగరపువలస

వేళాపాళా లేకుండా ఎడాపెడా విద్యుత్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఒకటో వార్డు కొత్తపేట, కొండపేట, జ్యూట్ కార్మికవాడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. ఇదేంటని ఎపిఇపిడిసిఎల్ అధికారులు, సిబ్బందిని అడిగితే ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపమని, ఇంకెవేవో కారణాలను చెబుతున్నారు

విద్యుత్ సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనులు, విద్యుత్‌లైన్లపై ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల సమయంలో సంబంధిత అధికారులు పత్రికా ప్రకటనలిచ్చి అధికారికంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. అవి అధికారిక కరెంట్ కోతలు అంతవరకూ బాగానే ఉంది. కానీ రోజంతా ఎడతెరిపి లేకుండా కరెంట్ కోతలను ఏమనాలని స్థానికులు కొందరు ప్రశ్నిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో కూడా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం అనధికార కోత కాక మరేంటని ప్రశ్నిస్తున్నారు.

ఒకవైపు వేసవి తాపం, ఉక్కపోత.. ఇంటా, బయటా ఎక్కడా ఉండలేని పరిస్థితి, అదేసమయంలో మరోవైపు ఇలా వేళాపాళాలేకుండా కరెంట్ కోతలు విధించి, స్థానికులను ఇబ్బందులకు గురిచేయడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాత్రి వేళ కరెంట్‌కోతతో కంటిమీద కునుకు లేకుండా పోతోందని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు అల్లాడిపోతున్నారని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు స్పందించి, అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అప్రకటిత కరెంట్ కోతలతో అల్లాడిపోతున్న జనం

పరవాడ :ఒకవైపు భానుడి ప్రతాపంతో మండుతున్న ఎండలు, ఉక్కపోత, మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలతో జనం అల్లాడిపోతున్నారు. మండలంలో ప్రతిరోజూ సాయంత్రం సమయంలో ఒకసారి, రాత్రి నిద్రించిన తరువాత మూడు నాలుగు సార్లు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. పగలు కూడా ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు ఇస్తారో తెలియలేని గందరగోళ పరిస్థితి నెలకొంది. గత 15 రోజుల నుండి తీవ్రమైన విద్యుత్ కోతలు కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కష్టపడి ఇంటికి చేరుకున్న కూలీలు రాత్రి సమయంలో కరెంటు పోవడంతో ఉక్కపోత, దోమల దండయాత్ర కారణంగా నిద్ర లేక మళ్లీ ఉదయం తమ పనులకు వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. కరెంటు కోతలు లేవంటూనే అనధికారిక కోతలు విధిస్తుండడంతో ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రాత్రి సమయంలో కరెంటు కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు

ఇష్టారీతిన కరెంట్ కోతలు



కరెంట్ కోతలు ఇష్టారీతిన ఉన్నాయి. ఏ సమయంలో కరెంట్ పోతుందో తెలియని పరిస్థితి. అర్ధరాత్రి వేళల్లో ఒక్కోసారి కరెంట్ పోతుంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం

డి.బాబాజీ,
జ్యూట్ కార్మికవాడ, కొత్తపేట

ఇబ్బందులన్నీ ఇన్నీ కావు



వరుస కరెంట్ కోతలతో ఇబ్బందులు అన్నీఇన్నీ కాదు. ఏ సమయంలో కరెంట్ పోతుందో తెలియని పరిస్తితి. కరెంట్ కోతలతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు

కర్రి రాము,
బంగ్లామెట్ట

ఎమ్మెల్యే గణబాబుకు అభినందనల వెల్లువ



గణబాబును అభినందిస్తున్న దత్త ఎన్‌క్లేవ్ నివాసితులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో విజయ దుందుభి మోగించి, హ్యాట్రిక్ విజయాల సాధించిన విశాఖ పశ్చిమ నియోజవర్గ ఎమ్మెల్యే పి.గణబాబును కాకానినగర్ శ్రీదత్త ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ నివాసితులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ మాజీ సెక్రటరీ లలితకుమారి, బోర్డు మెంబర్ సంధ్యారాణి, శ్రీ చైతన్య విద్యానికేతన్ ప్రిన్సిపల్ అనంతలక్ష్మి, మహిళామండలి సభ్యులు మేరీ, సునీత తదితరులు ఎమ్మెల్యే గణబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

గణబాబుకు కళా సేవాపీఠం అభినందన

గోపాలపట్నం :విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న పి.గణబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు పుష్పగుచ్ఛాలను అందజేసి, విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ ఎమ్మెల్యే గణబాబు నేతృత్వంలో గోపాలపట్నం కళలకు నిలయంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ కళాపీఠానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గోపాలపట్నం కళాపీఠం అధ్యక్షుడు గోరకల రామదాసు, మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సింహాచలం, కొప్పిశెట్టి వెంకట్, మాజీ గౌరవాధ్యక్షులు కంపర కనకరాజు, రామచంద్రరావు, కొంతం నూకరాజేశ్వరరావు, అనపర్తి అప్పారావు, మిద్ది అప్పారావు, ఎల్లపు రమణ, లైబ్రరీ నరసింహం, మల్లేశ్వర ప్రసాద్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



గణబాబును అభినందిస్తున్న కళాపీఠం సభ్యులు

కిశోర్‌కు కార్పొరేటర్ పరామర్శ



కిశోర్‌ను పరామర్శిస్తున్న కార్పొరేటర్ ముమ్మన

ప్రజాశక్తి- వేపగుంట : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న వేపగుంట ప్రజాశక్తి విలేకరి కోలంకి కృష్ణకిషోర్‌ను 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, స్థానిక వైసిపి నేతలు పరామర్శించారు.

ఈ సందర్భంగా కిశోర్ క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్న కార్పొరేటర్ ముమ్ముమన దేముడు, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు ఘనస్వాగతం



విమానాశ్రయంలో పల్లాను స్వాగతిస్తున్న కూటమి శ్రేణులు

ప్రజాశక్తి -గాజువాక: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన తర్వాత గాజువాక నియోజవర్గానికి సోమవారం రాత్రి విచ్చేసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఘనస్వాగతం లభించింది. సాయంత్రం ఆరుగంటలకు విశాఖ విమానాశ్రయంలో దిగిన పల్లాకు గాజువాకతోపాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి తరలివ చ్చిన టిడిపి, కూటమి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ పూలదండలతో విశాఖ విమానాశ్రయంలో స్వాగతించి, సత్కరించారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ జీపులో గాజువాక వరకు వచ్చిన పల్లాకు దారిపొడుగునా ఎయిర్‌పోర్ట్ నుంచి షీలా నగర్, అక్కిరెడ్డిపాలెం, బిహెచ్‌పివి, ఆటోనగర్, పాత గాజువాక జంక్షన్ వరకు ప్రతిజంక్షన్లోనూ అభిమానులు, నాయకులు బారులుదీరి నినాదాలు చేస్తూ ఘనంగా స్వాగతించారు.

మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు.భారీ ఎత్తున పల్లాకు స్వాగతించేందుకు వచ్చిన కూటమి శ్రేణులు, అభిమానులు, ప్రజలను నియంత్రించడానికి పోలీసులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. యువకుల, అభిమానులు, టిడిపి శ్రేణులు పల్లాతో కరచాలనానికి ఎగబడ్డారు. తర్వాత వాత గాజువాకలోని కుంచుమాంబ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. పల్లాను కలిసేందుకు, స్వాగతించేందుకు వచ్చిన నేతలు, కార్యకర్తలు, అభిమానులతో గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిలబడడానికి కూడా స్థలం లేనంతగా కిక్కిరిసిపోయింది.

నేడు మాడుగుల మోదకొండమ్మ జాతర

- ఉత్సవాలకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు
- పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు

ప్రజాశక్తి-మాడుగుల

మాడుగుల మోదకొండమ్మ జాతర మహోత్సవాన్ని ఈనెల 18న మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఆనవాయితీగా నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవానికి ఈసారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు.

మాడుగుల మోదకొండమ్మకు ప్రత్యేక చరిత్ర ఉంది. వందల ఏళ్ళ క్రితమే మాడుగుల ప్రాంతాన్ని పాలించిన ఒడిశా రాజులు అప్పట్లోనే అమ్మవారిని భక్తిగా కొలిచే వారని చరిత్ర చెబుతోంది. మొదట కోటలో రాజులు అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. ఇక్కడి నుండి ఏజెన్సీ ప్రాంతానికి ఘటాలు తీసుకుని వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ సమయంలో సంస్థానాధీశలు ఏజెన్సీ ప్రాంతానికి చేరుకుని అమ్మవారికి పూజలు నిర్వహించి తిరిగి మాడుగుల చేరుకున్నారు. తిరిగి వచ్చే సమయంలో పూజా సామాగ్రితో పాటు బంగారు చెంబు మర్చిపోయారు. ఈ విషయాన్ని గ్రహించి ఆనాటి మంత్రిని మినుములూరు ప్రాంతానికి వెళ్లి వీటిని తీసుకురమ్మని ఆదేశించారట. మంత్రి తిరిగి అక్కడికి చేరుకున్న సమయంలో.. బంగారు చెంబు విషయమై చెప్పేసరికి అమ్మవారు ఆగ్రహంతో ఆ చెంబు తన్నగా ప్రస్తుతం మాడుగుల్లో ఉన్న దేవాలయం వద్ద పడిందని దీంతో రాజులు చిన్నపాటి గుడిని నిర్మించాలని పూర్వీకులు కథనం.




విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న ఆలయ ప్రాంగణం

కొన్నేళ్ల క్రితం మాడుగుల తహశీల్దారుగా పని చేసిన అంపన్న ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. పురాతనమైన చిన్న దేవాలయం స్థానంలో అతిపెద్ద దేవాలయం నిర్మించడానికి గ్రామస్తుల సహకారం తీసుకున్నారు. అప్పట్లో వ్యాపారుల విరాళాలతో అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టారు. చోడవరం కి చెందిన శిల్పి ఎల్లయ్య అమ్మవారి విగ్రహాన్ని ఎంతో ఆకర్షణీంగా రూపొందించారు.

శతకం పట్టు వద్ద ఏర్పాట్లు

అమ్మవారి పండుగకు నెల రోజులు ముందు ఆలయం వద్ద నుండి అమ్మవారి పాదాలు, ఘటాలు ఊరేగింపుగా తీసుకొని రాజు గారి కోట ఆవరణలో ఉన్న శతకం పట్టు వద్ద కొలువు ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు అమ్మవారు కొలువు పూర్తి అయిన తర్వాత తిరిగి గ్రామ పురవీధులలో మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్లి పాదాలు ఘటాలు ఆలయం వద్ద ఉంచుతారు దీంతో పండుగ పూర్తవుతుంది.





మాడుగుల మోదకొండమ్మ విగ్రహం, రంగులతో ముస్తాబైన అమ్మవారి ఆలయం

ఘనంగా అమ్మవారి సారె ఊరేగింపు

మోదకొండమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో పలు వీధులకు చెందిన భక్తులు అమ్మవారి సారెను ఘనంగా ఊరేగించారు. గవర వీధి, కొబ్బరి తోట వీధి, జగ్గన్న చావిడి, రాజ వీధి, మోదమాంబ కాలనీ చెందిన భక్తులు అమ్మవారికి తీర్థ ప్రసాదాలు, ఘటాలతో భారీగా ఊరేగించారు.

భక్తులకు పలు సేవా కార్యక్రమాలు

మోదకొండమ్మ జాతరకు వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో సేవా సంస్థల సహకారంతో చలివేంద్రాల ఏర్పాటు, ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ చేస్తారు. శ్రీరామ మెడికల్ షాప్ వద్ద శ్రీనాథ్ రామమూర్తి ఆధ్వర్యంలో గ్లూకోజ్ వాటర్, కొట్యాడ రమేష్ అరుణ, కొట్యాడ కుటుంబం ఆధ్వర్యంలో ప్రసాదం, మజ్జిగ, గండి జోగినాయుడు ఆధ్వర్యంలో రెండు రోజులు కూలింగ్ మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

పండుగ సందర్భంగా ఈ ఏడాది భారీ ఎత్తున సాంస్కృతిక వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సుమారు పది రోజుల ముందు నుండే ప్రారంభమైన వినోద కార్యక్రమాల్లో భాగంగా జబర్దస్త్ ఫేమ్, రేలారే రేలారే, సాంఘిక, పౌరాణిక నాటకాలు, చిటిక భజనలు, నేల వేషాలు, ఫ్లయింగ్ హనుమాన్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.విద్యుత్ అలంకరణ అమ్మవారి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎమ్మెల్యేను కలిసిన గ్రంథాలయ అధికారులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుందరపు విజయ్ కుమార్‌ను సోమవారం ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన గ్రంథాలయ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాలువా కప్పి సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రంథాలయ అధికారులు వి.ఆనంద్, ఎల్వి రమణ, డి.కోటేశ్వరరావు, ఎస్.శకుంతలాదేవి ఉన్నారు.

హోం మంత్రిని కలిసిన సిఐ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను అచ్చుతాపురం సిఐ ఎం.బుచ్చిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధిలోగల కోటవీధి ఈద్ గాహ్ వద్ద సోమవారం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సాముహిక నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగం, సహనం బక్రీద్ అందించే సందేశమన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగాలన్నారు. నమాజ్ అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పరవాడ : మండలంలోని పరవాడ, ఎన్టీపీసి, చీపురుపల్లి, గొల్లగుంట తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను సోమవారం ముస్లిములు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గొల్లగుంట మసీదులో పెద్దలు, మతగురువులు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ధార్మికో ఉపన్యాసం చేశారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ముస్లిములు ఒకరికొకరు ఈద్ శు భాకాంక్షలు తెలుపుకున్నారు.



పరవాడ మండలంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఎంపీ రమేష్‌ను కలిసిన రేషన్ డీలర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్‌ని, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌ని సోమవారం అనకాపల్లి పట్టణంలోని చౌక ధరల దుకాణ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చౌక ధరల దుకాణాలకు చెందిన పలు సమస్యలు వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

టీచర్లను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి

మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

2023 జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీపై వెళ్లిన సుమారు 400 మంది ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేసే విధంగా కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్.ప్రసాద్‌లకు సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా యుటిఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ జిఓ నెంబరు 3 రద్దు కావడం, జీవో నెంబరు 117 అమలు కావడం వల్ల సుమారు 400 మంది ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయ్యారని, వారంతా ఎన్నో ఇబ్బందులకు గురై బాధపడుతున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువగా మహిళా ఉపాధ్యాయులు, రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నవారు ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రకటించిన మెగా డిఎస్‌సిలో పేర్కొన్న నేపథ్యంలో ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతంలోని ఖాళీలకు బదిలీ చేసే విధంగా రాష్ట్ర నాయకులు కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన రాష్ట్ర నాయకులు ఈ సమస్యను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, నాయకులు గాయత్రి, జిఎస్ ప్రకాష్, మామిడి బాబూరావు, టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


యుటిఎఫ్ రాష్ట్ర నేతలకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా నాయకులు


అయ్యన్నను సత్కరిస్తున్న టిడిపి నేత రత్నాకర్ తదితరులు

అయ్యన్నకు టిడిపి నేతల సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నిక కానున్న నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు నర్సీపట్నంలోని ఆయ్యన్న స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సాలువతో సన్మానం చేసి బుద్ధుడు విగ్రహాన్ని బహూకరించారు. సభాపతి పదవికి అర్హులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు భావించి స్పీకర్ పదవిని ఇచ్చారని,ఆ పదవికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కశింకోట మండల అధ్యక్షులు కాయల మురళి, నాయకులు కాంద్రపు అక్కునాయుడు, భీమవరం మాజీ సర్పంచ్ సత్తిబాబు, మేడిశెట్టి సన్యాసినాయుడు, రెడ్డి సూర్యనారాయణ, చిరికి చైతన్య, చింతి రాజునాయుడు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న కాలువ పూడిక తీత పనులను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి పంటకు నీరు సమృద్ధిగా చేరేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొద్ది సంవత్సరాల నుండి కాలువలో పిచ్చి తుప్పలు పేరుకుపోవడంతో రైతుల పంట పొలాలకు నీటి సరఫరా అందని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ తరుణంలో ఉపాధి హామీ పనుల ద్వారా పూడికలను తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. పేదలందరూ ఈ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెంలోని విశాఖ డెయిరీ పాల సొసైటీలో ఇద్దరు నూతన డైరెక్టర్లను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన డైరెక్టర్లుగా దొడ్డి రామప్పడు, మద్దాల భవాని ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షుడు దొడ్డి సోమేశ్వరరావు, సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, మాజీ ఎంపిటిసి దొడ్డి సూర్య ప్రకాష్, శిలపరశెట్టి మాలి నాయుడు, దొడ్డి రాజ్ కోటి, సూరిశెట్టి రమణ, దొడ్డి అర్జున, రాము, ఆడారి వెంకటరమణ, కోరుబిల్లి కోటి, కోణతాల వెంకటకృష్ణ, దాడి రాంబాబు, సూరిశెట్టి సూర్యనారాయణ, దొడ్డి సూరిబాబు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక

మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన సినీ దర్శకుడు, నిర్మాత అయిన కోరుకొండ గోపికృష్ణ హెల్పింగ్ హ్యాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థను సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక వినాయక కళ్యాణ మండపం ఆవరణలో సంస్థ లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తమ సంస్థ ద్వారా సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. తమ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలకు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు టెక్కలి పరశురాం, ఏవి సత్యనారాయణ, దాడి ముసలి నాయుడు, విల్లూరి నూక నరసింహారావు, కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, ఆడారి శ్రీకాంత్, పెంటకోట శ్రీరామ్మూర్తి, బొడ్డేడ అప్పలనాయుడు, కాండ్రేగుల పద్దేశి నాయుడు పాల్గొన్నారు.



సంస్థ లోగోను ఆవిష్కరిస్తున్న గోపికృష్ణ, స్థానిక నాయకులు

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

అధికారుల ఆదేశాలు బేఖాతరు


ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని గంగవరం సర్వే నెంబర్ 38లో ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమించి దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు జూన్ 4 వరకు ఎన్నికల డ్యూటీలో ఉండడంతో ఆక్రమదారులు రెచ్చిపోయి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయాన్ని పలువురు గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, రెవెన్యూ అధికారులు ఇటీవల అక్రమ నిర్మాణాలను పరిశీలించి వాటిని తొలగించారు. అయినప్పటికీ ఆక్రమణదారులు అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి రాత్రికి రాత్రే మళ్లీ అక్రమ నిర్మాణాలను యథావిధిగా చేపట్టారు. ఈ విషయమై స్థానిక వీఆర్వో వెంకటేష్‌ను వివరణ కోరగా ఇటీవలే అక్రమ కట్టడాలను తొలగించామని, అయినప్పటికీ ఆక్రమణదారులు నిర్మాణాలు చేశారని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరడమైందని చెప్పారు. త్వరలో పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాలను తొలగించడం జరుగుతుందని ఆయన చెప్పారు.


దరఖాస్తు అందజేస్తున్న దృశ్యం

ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం సీట్లుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కశింకోట

స్థానిక రాజీవ్‌గాంధీ ఆర్ఈసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం సీట్లుకు అడ్మిషన్ల నిమిత్తం దరఖాస్తుల స్వీకరణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ కావలసినవారు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ తదితర నాలుగు బ్రాంచీలు ఉన్నాయని, ఆసక్తి గల ఆర్ఇసిఎస్ పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 9063297220, 08924 220377, 9505504220 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణేష్, ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శివరాం, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల వసతి గృహాల సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రవ్యాప్తంగా 134 ఆదర్శ పాఠశాలల వసతి గృహాల్లో పనిచేసే వార్డెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మ్యాన్, అప్యాన్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దాదాపు 1500 మంది రోజువారీ వేతనంతో పని చేస్తున్న సిబ్బందిని కాంట్రాక్ట్‌లోకి మార్పు చేసి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాల నుండి పనిచేస్తున్న వీరిని తొలగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీరి సమస్యలను గత ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వమైనా వేతనాలు పెంపుదల చేసి ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, హాస్టళ్లో సిబ్బంది సంఖ్యను పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని కోరారు.

ఎమ్మెల్యే కొణతాలకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులుగా ఎన్నికైన కొణతాల రామకృష్ణను జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం మండలంలోని ఊడేరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు, దుస్సాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కొణతాల రామకృష్ణ గెలుపులో కీలక పాత్ర వహించిన ఆయన అల్లుడు భీమరశెట్టి రాంకీని వారి ఆఫీసులో ఊడేరు జనసేన పార్టీ కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా విశ్వనాథం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు బుద్ద విశ్వనాథం జన్మదిన వేడుకలు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వనాథాన్ని సాలువతో సత్కరించి భారీ గజమాల వేసి, నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ విశ్వనాథం ఇంటర్మీడియట్ వరకు చదువుకొని తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పార్టీ పట్ల విధేయుడిగా ఉంటూ ఏ పని అప్పగించినా నిబద్ధతతో చేస్తారని తెలిపారు. టిడిపి నాయకులు బొడ్డేడ మురళి, మళ్ల గణేష్, విల్లూరి రమణబాబు, బుద్ద శ్రీనివాసరావు, చదరం శివ అప్పారావు, కొణతాల గంగాధర్, ఆనంద్, రామప్పరావు, మళ్ల జగదీష్, సిమ్మిటి రామకృష్ణ తదితరులు విశ్వనాథానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

20న రక్తదాన శిబిరం


ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ.అగ్రహారం గ్రామంలో నూకాలమ్మ తల్లి గుడి వద్ద చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ మేరకు రక్తదాన శిబిరం కరపత్రాన్ని కొండపాలెం సర్పంచ్ ఎంవిఎస్.నాయుడు, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణాన్ని కాపాడిన వారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుంకర శ్రీనివాసరావు, దేవర భూలినాయుడు, గ్రామ యువత పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కూలిన బ్రిడ్జిని పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వద్దాది

బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద ప్రధాన రహదారిపై కూలిన బ్రిడ్జిని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, చోడవరం శాసన సభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు పరిశీలించారు. బ్రిడ్జి మరమ్మతులకు తక్షణం పనులు ప్రారంభించే విధంగా ప్రణాళిక తయారు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి రావికమతం మండల అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

వేడిగాలులకు తల్లడిల్లిన జనం

ప్రజాశక్తి -నక్కపల్లి:భానుడు నిప్పులు గక్కడంతో జనం తల్లడిల్లారు. సోమవారం వేడి గాలులతో భానుడు విరుచుకు పడటంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. 39 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో ముఖ్యంగా ప్రయాణాలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడ్డారు. వడగాలులు వీచడంతో జనం తట్టుకోలేక అల్లాడి పోయారు. బైకులపై వెళ్లిన వారు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణాలు సాగించారు. మహిళలు చీర కొంగులు నెత్తిన కప్పుకుని ప్రయాణాలు చేసారు. పాదచారులు అవస్థలు అంతా కాదు. ఎండ తీవ్రతకు భయపడి పెద్దగా జనం బయటకి రాకపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. సాయంత్ర మైనా ఎండ వేడిమి తగ్గక పోవడంతో వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు, బాలింతలు తీవ్ర అవస్థలు పడ్డారు. భవన నిర్మాణ కార్మికులు, కూలీలు ఎండ దెబ్బకు విలవిలలాడారు. ఇటీవల కాలంలో అప్పుడప్పుడు కురిసిన వర్షానికి వాతావరణం చల్ల బడినప్పటికీ, గత రెండు, మూడు రోజుల నుండి భానుడు ఉగ్రరూపం దాల్చడంతో జనం బెంబే లెత్తుతున్నారు.


నిర్మానుష్యంగా ఉన్న రహదారి


తలపై చీరను కప్పుకుని వెళుతున్న మహిళలు


ఎమ్మెల్యే అయ్యన్నను సత్కరిస్తున్న సంఘం నాయకులు

ప్రహరీ నిర్మాణానికి అనుమతివ్వాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన నర్సీపట్నంలో కవర్డ్, హైటర్ సమాధుల స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సిద్దపడుతున్నట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు అన్నారు. సోమవారం ఆయన జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నాయకులతో కలిసి కవర్డు, హైటర్ల సమాధుల స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అల్లూరి సంఘం నాయకులు నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడును కలిసి స్థల విషయంపై చర్చించారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సారథ్యంలో తమ సొంత నిధులతో ప్రహరీ గోడను నిర్మాణం చేయదల్చామని ఇందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆయన తన సుముఖతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు సంఘం కార్యదర్శులు శివంగి నాగేశ్వరరావు, శ్యామల వరలక్ష్మి, లక్కాకుల బాబ్జి, అంబటి వరహాల రాజు, విశాఖ జిల్లా అల్లూరి గాం గంటం దొర, మల్లు దొరల సేవా సంఘం ఉపాధ్యక్షులు పోతిన వెంకటేశ్వరరావు, లీగల్ అడ్వైజర్ కంఠంరెడ్డి శివశంకర్, కార్యదర్శి కంబాల శంకర్రావు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

కుళాయి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ బుడ్డడపాడులో రూ.12.80లక్షలతో సోమవారం ఇంటింటికి కుళాయి పనులను సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గెడ్డం నానాజీ, సోములు, రుత్తల సత్యనారాయణ, ప్రసాద్, వార్డు మెంబర్ సెగ్గె రాము పాల్గొన్నారు.


తుప్పలు తొలగిస్తున్న కూలీలు

ప్రభుత్వ కార్యాలయాల వద్ద తుప్పల తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గొలుగొండ:మండల కేంద్రంలోని పిచ్చి తుప్పల మధ్య ప్రభుత్వ కార్యాలయాల పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మండల రెవెన్యూ కార్యాలయం, కోఆపరేటివ్ సొసైటీ భవనం మధ్య మొక్కలు ఏపుగా పెరిగాయి. దీనిపై ప్రజాశక్తిలో వచ్చిన పిచ్చితుప్పల మధ్య ప్రభుత్వ కార్యాలయాలు కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఈ కార్యాలయాల మధ్య పిచ్చితుప్పలు తొలగింపునకు శ్రీకారం చుట్టారు.

నిందితున్ని శిక్షించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:పాడేరు మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాల్లో ఆరేళ్ల బాలికను అత్యాచారం చేసిన నిందితుడిని ఏఎస్‌పి ధీరజ్, సీఐ, ఎస్ఐలు ప్రత్యేక చొరవతో పట్టుకోవడం పై మండల గిరిజన మహిళ సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి, కార్యదర్శి సీసా విజయలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు ఈశ్వరి మాట్లాడుతూ, అత్యాచారం చేసిన దుండగుడుకి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆరు సంవత్సరాల పాపను ఎత్తుకుపోయి అత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాలిక తల్లిదండ్రులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా మహిళా నేతలు డిమాండ్ చేశారు.

హోం మంత్రి అనితకు ఘన సత్కారం


అనితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:విశాఖలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను సోమవారం ఏపి పంచాయితీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా తరుపున జిల్లా అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సీతారామరాజు ఆధ్వర్యంలో సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతిపత్రం రూపంలో ఉద్యోగుల సమస్యలను తనకు నివేదిస్తే తన వంతు కృషి చేస్తానని మంత్రి అనిత హామీ ఇచ్చినట్లు నక్కపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సీతారామరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు బిహెచ్ వీ రమణబాబు, నరసింగరావు, గంగాధర్, సత్యనారాయణ, ఎస్.త్రినాధ్, స్వామి, జడ్పి యూనిట్ ప్రెసిడెంట్ పివియన్ మూర్తి, వరదేశినాయుడు, లోవతల్లి, మన్మోహన్, శ్రీను తదితరులు ఉన్నారు .

మృతుని కుటుంబ సభ్యులకు మంత్రి ఓదార్పు

నక్కపల్లి: నక్కపల్లికి చెందిన మృతుడు కర్రి శ్రీను కుటుంబ సభ్యుల యోగక్షేమంపై హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. కల్లుగీత కార్మికుడు కర్రి శ్రీను ఆదివారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందకు జారిపడి మృతి చెందిన విషయం తెలిసిందే. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మీగడ సత్తిబాబు సోమవారం ప్రమాద ఘటనను మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంత్రి అనిత మృతుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు.ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక సహాయం త్వరిత గతిన అందేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

4న అల్లూరి జయంతోత్సవాలు


నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరిపే స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి జులై 4న అల్లూరి 127వ జయంతోత్సవాలు కృష్ణదేవిపేట స్మారక పార్కులో ఘనంగా జరపాలని నిర్ణయించినట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. సోమవారం స్థానిక అల్లూరి స్మారక పార్కులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అల్లూరి చరిత్రకు సంబంధించిన ఎంతో విలువైన 2ఎన్‌టూ 3 అడుగుల భారీ సైజు 30 చిత్రపటాలను సంఘం సొంత నిధులతో పార్కులోని ఆడిటోరియంలో శాశ్వతంగా అమర్చాలని నిర్ణయించామని, ఇందుకు అనుమతిని ఇవ్వాలని ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్న పాత్రుడును కోరామన్నారు. స్పందించిన అయ్యన్నపాత్రుడు కలెక్టర్, ఆర్డీఓతో మాట్లాడతానని, చిత్రపటాలను ఆడిటోరియంలో ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. పార్కులో తాగునీటికి ఇబ్బంది ఉందని, సమాధులపై ఉన్న పై స్లాబు తదితర వాటిని మరమ్మతుపై అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకు వెళ్లగా...త్వరలో 30 లక్షలు విడుదల చేసి పార్కు అభివృద్ధికి ఖర్చు చేస్తామని తెలిపారన్నారు.అల్లూరి, గంటం సమాధుల వద్ద పుష్పాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శివంగి నాగేశ్వరరావు, శ్యామల వరలక్ష్మి, లక్కాకుల బాబ్జి, అంబటి వరహాల రాజు, విశాఖ జిల్లా అల్లూరి గాం గంటం దొర, మల్లు దొరల సేవా సంఘం ఉపాధ్యక్షులు పోతిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిడుగు పడి పశువులు మృతి

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని కురుస్తున్న వర్షాలతో పిడుగు పాటుకు 11 మూగ జీవాలు మృతి చెందాయి. మండలంలోని వేంగడ పంచాయతీ డొంకపుట్టు గ్రామానికి చెందిన సివేరి కళ్యాణ్, సూరే రఘురం, శివేరి సత్యారావు, శివేరి బర్నాన్న, గుండన్న, గంగన్న, లంగుపర్తి పంచాయతీ పెండిలి రామన్నలకు చెందిన పశువులు పశు గ్రాసం కోసం కొండపైన మేత కోసం వెళ్లాయి. భారీ వర్షంతో పిడుగు పడటంతో 11 దుక్కెటెద్దులు మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లోలి దుర్గారావు (18) తనకు బైక్ కొని ఇవ్వాలని ఇంట్లో తల్లిదండ్రులను అడిగాడు. బైక్ కొని ఇవ్వలేదని దుర్గారావు మనస్థాపం చెంది ఈనెల 15న పురుగుల మందు సేవించి, ఇంటికి వచ్చి పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు దుర్గారావును తుని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి శ్రీను తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

-అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి:ఫారెస్ట్ అధికారుల ఆటంకంతో నిలిచిన రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని స్థానిక సిపిఎం జడ్పీటీసీ దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలు తెలుసుకునేందుకు మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి కడరేవు గ్రామంలో సందర్శించారు. అనంతరం గ్రామస్తులు జడ్పీటీసీతో మాట్లాడుతూ, రోడ్డు పనులు చేపట్టేందుకు గత రెండు సంవత్సరాల కాలంలో పనులను ప్రారంభించారని తెలిపారు. ఆందోళన చేపట్టగా అధికారులు దిగొచ్చి రోడ్డు పనులు చేపడుతుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారని తెలిపారు. అనంతరం గిరిజనులను ఉద్దేశించి గంగరాజు మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు కనెక్టివిటీ పాడేరు ప్రాజెక్ట్ కింద ట్రైబల్ వెల్ఫేర్ పథకం కింద కోటి 70 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. 2021 -22 సంవత్సరంలో గుమ్మ పంచాయతీ పరిధి నిమ్మ ఊట నుండి సుమారు మూడు కిలోమీటర్ల దూరం పనులను చేపట్టిన పనులు వదిలి వేశారన్నారు. పనులు జరగకుండానే నిధులు సుమారు 65 లక్షల పైగా స్వాహా జరిగినట్లు ఆందోళన చేపట్టడంతో అధికారులు దిగొచ్చి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం సమీద, నెరడి బంద మీదుగా కడరేవు, గోకులపాలెం, కొట్టెంగుడ మీదుగా కరిగోడ వరకు రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రారంభించగా ఫారెస్ట్ అధికారుల ఆటంకంతో నిలిచిపోయాయన్నారు.

మాధవదార శ్రీశ్రీశ్రీ కుంచుమాంబ అమ్మవారి పండుగ ప్రత్యేకం

నేడే కుంచుమాంబ పండగ

ప్రజాశక్తి- మాధవధార

మాధవధారలో కుంచుమాంబ, కనకమహాలక్ష్మి, కొత్త మహాలక్ష్మి అమ్మవార్ల పండగ మహోత్సవాలు కొన్ని దశాబ్ధాలుగా ఆనవాయితీగా, వైభవోపేతంగా జరుగుతున్నాయి. గతంలో అమ్మవార్ల సేవలను కంచరాన కుటుంబీకులు, ఉత్సవ నిర్వహణ బాధ్యతను సనపల (మున్సబు) కుటుంబీకులు స్వీకరించేవారు. తదనంతర కాలంలో శ్రీ మాధవ యువజన సమాజం ఈ ఉత్సవ నిర్వహణ బాధ్యతను తీసుకుంది. అమ్మవార్ల సేవలను కంచరాన చంద్రయ్య కుటుంబం చేస్తోంది.



ఫలసాయం అందాక పండగకు తెరదీత

ఏటా మాధవధారలో తోటల ఫలసాయం అందిన జూన్, జులై నెలల్లో మాధవధారలో అమ్మవార్ల పండుగను నిర్వహిస్తుంటారు.

ఈ ఏడాది జూన్ 13 నుంచి జూన్ 30వ తేదీవరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూన్ 13న పండుగ చాటింపు, 14న అమ్మవారి సంత, కంచరాన కుటుంబం వారు గ్రామ ప్రజల తరపున జూన్ 15వ తేదీన గ్రామ పొలిమేరల వద్ద పిడతలతో సత్తెమ్మకు కుంభం పెట్టారు. జూన్ 16న గ్రామ పొలిమేరల వద్ద దాగర్లలో మరిడమ్మకు కుంభం పెట్టారు. జూన్ 17న కుంచుమాంబ ఆలయం నుంచి తోలేళ్ల ఉత్సవం నిర్వహించారు. మాధవధార రామాలయం ఎదురుగా ఉన్న స్థలంలో వేపకర్రతో తయారు చేసిన అమ్మవారి ప్రతిమలను ప్రతిష్టించారు. దీనినే సదరం పట్టు (సతకంపట్టు) అంటారు. ఉత్సవాలు అక్కడ నుంచే మొదలౌతాయి. జూన్ 18న మంగళవారం ముఖ్యమైన కుంచుమాంబ అమ్మవారి పండుగను నిర్వహిస్తారు. ఆ రోజు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని చాలా ప్రాంతాల నుంచి ఈ పండుగకు ప్రజానీకం హాజరౌతారు.

సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు పండుగ నిర్వహణలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్టేజీ ప్రోగ్రాంలు, నేలవేషాలు, ఇతర పౌరాణిక, జానపద కళారూపాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు పులివేషాలు కూడా ఉంటాయి. వీటిని గ్రామస్తులే వేస్తారు. అమ్మవారిని పూలఘటంతో ఇంటింటికీ తిప్పి ఆశీర్వచనాలు పొందుతారు. సాయంత్రం ఐదు గంటలకు సదరంపట్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఎంతో ఉత్సాహంగా రాత్రి 12గంటలకు కుంచుమాంబ ఆలయానికి చేరుకోవడం ద్వారా అనుపు ఉత్సవం ముగుస్తుంది. తరువాత వచ్చే మంగళవారం జూన్ 25న మారువారం నిర్వహిస్తారు. 27న కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇది కూడా సదరంపట్టు వద్ద ప్రారంభమై, కనకమహాలక్ష్మి అమ్మవారి చెట్టు (సీతన్న గార్డెన్స్) వద్దకు చేరుకోవడంతో అనుపు ఉత్సవం ముగుస్తుంది. జూన్ 30న కొత్త మహాలక్ష్మి అమ్మవారి మహోత్సవం జరుగుతుంది. ఇది కూడా సదరంపట్టు వద్ద ప్రారంభమౌతుంది. అమ్మవారి వేడుకకు వందలాది మంది మహిళలు కడవలు, బిందెలతో నీళ్లు తీసుకుని వెళతారు. అమ్మవారి చెట్టు వద్దకు చేరుకున్న తర్వాత ఈ నీటితో అమ్మవారి చెట్టుకు అభిషేకం చేస్తారు. ఆ నీటిని శిరస్సుపై చల్లుకుంటారు. ఈ ఉత్సవంతో మొత్తం పండుగ ముగుస్తుంది. ఉత్సవంలో ఏర్పాటు చేసే ప్రతి సాంస్కృతిక కార్యక్రమం సందేశాత్మకంగానూ, ఉత్సాహం, వినోదభరితంగా ఉంటుంది.



అమ్మవారి ఆలయం

పండగకు ఏర్పాట్లు పూర్తి



రామచంద్రరావు



రాంగోపాలరావు

మాధవధార కుంచుమాంబ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీమాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రాంగోపాలరావు, సహాయ కన్వీనర్ పప్పల రామచందర్రావు తెలిపారు. మాధవధార శతకంపట్టు వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టామన్నారు. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరంతో పాటు తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మాధవధార ప్రాంతాలకు చెందిన మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, మానవసేవే మాధవసేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాధవధార గ్రామ పెద్దలు, ప్రజలు సహాయ సహకారాలతో అమ్మవారి పండుగను ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.